# ది గెస్ట్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



### THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)

(గత సంచిక తరువాయి)

## 9

**మర్నాడు ఉదయం, ఫ్లయిట్‌లో అమృతఫుడ్ ప్రొడక్ట్** కంపెనీలో పనిచేసే టెక్నికల్ మేనేజర్ త్రిపాఠి హైదరాబాద్ నుంచి మద్రాస్ చేరుకున్నాడు. దారిలో ఆయన ఆలోచన అంతా తనని ఇంటర్వ్యూకి పిలిచిన కంపెనీ మీదే. మద్రాస్‌లో రెండు ఫుడ్ ప్రొడక్ట్స్ కంపెనీలున్నాయి. ఆ రెంటిలో ఇది ఎవరిదై ఉంటుంది?

తనకి రాకపోకలకి ఫ్లయిట్ రిటర్న్ టికెట్ ఇచ్చారు. ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో రూం బుక్ చేసారు. అంటే టెక్నికల్ మేనేజర్‌ని గౌరవించే కంపెనీ అయివుంటుంది. సాధారణంగా రైల్వే ఫస్ట్ క్లాస్ ఛార్జీలే ఇస్తారు. తను వాళ్ళని ఇంప్రెస్ చేయగలిగితే చాలు. ఎక్కువ జీతంతో మంచి ఉద్యోగం లభిస్తుంది.

అమృత ఫుడ్ ప్రొడక్ట్స్ ఫైనాన్స్ డైరెక్టర్, అతని అన్న మేనేజింగ్ డైరెక్టర్ స్వతహాగా బహు పిసినార్లు. తన జీతం ఎక్కడ వేసిన గొంగళి సామెతలా ఉంది గత రెండేళ్ళుగా.

ఆయన్ని రిసీవ్ చేసుకోడానికి ప్రయివేట్ టేక్సీ ఎయిర్ పోర్ట్‌కి గేట్ దగ్గర నించున్నాడు డ్రయివర్ తనే త్రిపాఠి అని డ్రయివర్‌కి చెప్పగానే 'ఎక్కడ పనిచేస్తున్నారు? అని అడిగాడు డ్రయివర్. ఆయన సమాధానం కరెక్ట్‌గా ఉండటంతో డి.టి.వైపు తీసుకెళ్ళాడు డ్రయివర్.

సరాసరి హోటల్‌కి చేరుకున్నాడు త్రిపాఠి. సరిగ్గా మధ్యాహ్నం మూడింటికి మరో ఫైవ్ స్టార్ హోటల్‌లోని ఓ గదికి తీసుకెళ్ళాడు డ్రైవర్ త్రిపాఠిని.

అంతకు ఒక గంటముందే నిద్రలేచిన బెనర్జీ విశ్వంతో కలిసి బయటికి వెళ్ళిపోయాడు. గతరాత్రి మద్రాస్ చేరుకున్న బెనర్జీ తెల్లారి ఎనిమిది దాకా మేలుకుని తాగుతూనే ఉన్నాడు. ఎనిమిదిన్నరకి పడుకుని రెండున్నరకి నిద్రలేచాడు.

బెనర్జీ మిత్రుడొకడు త్రిపాఠిని ఇంటర్వ్యూ చేయడానికి ఒప్పుకున్నాడు. ఏఏ ప్రశ్నలు అడగాలో విశ్వం అతన్ని పూర్తిగా బ్రీఫ్ చేసాడు. వాళ్ళ ఇంటర్వ్యూ మొత్తం టేప్ రికార్డర్‌లో రికార్డ్ అవుతుంది.

త్రిపాఠి ఆ గదిలోకి అడుగుపెట్టాక బెనర్జీ మిత్రుడు ఆయనతో కరచాలనం చేసి అడిగాడు.

"మీ ప్రయాణం సుఖంగా జరిగిందిగా?"

"యస్. థాంక్యూ"

"మీరు ఎంతకాలంగా అమృత ఫుడ్స్‌లో పనిచేస్తున్నారు?" అడిగాడాయన.

త్రిపాఠి జవాబు చెప్పాడు.

"మీకు ఈ వ్యాపారం గురించిన పూర్తి అనుభవం ఉందని అనుకుంటున్నారా?"

"యస్."

"అన్ని విషయాల్లో?"

"అన్ని విషయాల్లో బైదిబై నన్ను ఏ కంపెనీ ఇంటర్వ్యూ చేస్తుందో చెపుతారా? ఇంతదాకా తెలీదు" అడిగాడు త్రిపాఠి.

"ష్యూర్. హెల్త్ ఫుడ్‌ప్రొడక్ట్స్ లిమిటెడ్" చెప్పాడు ఆయన.

ఆ తర్వాత జరిగిన ఇంటర్వ్యూలో అమృత ఫుడ్స్ రామెటీరియల్‌ని ఎక్కడనుంచి తెస్తుంది, రోజుకి ఎంత సరుకు తయారుచేస్తుంది, అందులో ఎంత పంపుతుంది, లేబర్‌తో మేనేజ్ మెంట్‌కి సంబంధ బాంధవ్యాలు ఎలా ఉన్నాయి, త్వరలో కంపెనీని అభివృద్ధి చేసే స్కీమ్ లేవిలాంటి అనేక ప్రశ్నలని అడిగాడాయన. అయితే అమృత ఫుడ్స్‌కి సంబంధించిన ఆ వివరాలు అడుగుతున్నట్లు కాకుండా, త్రిపాఠికి ఈ వ్యాపారంలో ఎంత అనుభవం ఉంది అన్న అంశం పరీక్షిస్తున్నట్లుగా అడిగితే, ఆయన 'ఉదాహరణగా' తన కంపెనీ విశేషాలన్నీ తెలియచేసాడు.

త్రిపాఠి చెప్పే సమాచారానికి ఇంటర్వ్యూ చేసే ఆయన మొహంలో సంతృప్తి కనిపిస్తుండటంతో త్రిపాఠి విజృంభించి తనకి చాలా తెలుసన్న ఇంప్రెషన్ ఇవ్వడానికి అమృత ఫుడ్ ప్రొడక్ట్స్ గురించి తనకి తెలిసిన చిన్నా పెద్దా విషయాలన్నీ చెప్పాడు.

"మా కంపెనీ త్వరలో ఓ కొత్త డ్రింక్‌ని మార్కెట్లో ప్రవేశపెట్టబోతోందని మీకు తెలుసా?" అడిగాడు త్రిపాఠి.

"విన్నాం. కొత్తరకం సాఫ్ట్ డ్రింక్ అన్నారు. ఆ వివరాలు తెలుసా?" అడిగాడు బెనర్జీ ఫ్రెండ్

త్రిపాఠి వెంటనే గర్వంగా సమాధానం చెప్పాడు.

"ఇంతదాకా సాఫ్ట్ డ్రింక్స్ కేవలం ఆర్టిఫిషియల్ టేస్ట్ ఎసెన్స్ చేస్తున్నాం. మేంగో, ఆరెంజ్, గ్రేప్ మొదలయిన ఫ్లేవర్స్‌తో. కాని ఈ డ్రింక్ అలా ఆర్టిఫిషియల్ ఎసెన్స్‌తోకాక పళ్ళతోనే చేస్తారు."

"అంటే?"

"అంటే ఆయా ఫ్రూట్ పల్ప్‌ని ఉపయోగించన్నమాట. ఉదాహరణకి మామిడికాయ డ్రింక్ మామిడికాయ గుజ్జును ఉపయోగించి ఆరెంజ్ డ్రింక్ ఆరెంజ్ గుజ్జునుపయోగించి చేస్తారు. పబ్లిసిటీలో 'ఇంతకాలం మీరు తాగింది కేవలం ఆర్టిఫిషియలే. పళ్ళ అసలయిన రుచి చుడాలనుకుంటే ఈ డ్రింక్ తాగండి' లాంటి కేంపైన్ చేయాలనుకుంటున్నాం. మొదట్లో వాటి సేల్స్ విపరీతంగా ఉంటాయి."

"అలాగా? ఏ ఏ పళ్ళతో చేద్దామనుకుంటున్నారు?"

"సపోట, జామ, ఆరెంజ్, మామిడి వీటి మిశ్రమంతో మరోటి మొత్తం అయిదు వెరైటీలు."

"దీనికి టెక్నికల్ కొలాబరేషన్ ఉందా?"

"ఉంది. స్విడ్జర్లేండ్‌కి చెందిన ఓ సంస్థ సూపర్‌విజన్‌లో తయారు చేస్తున్నారు."

"యంత్రాలు?"

"ఇంకా ఫైనలైజ్ కాలేదు. మొన్న మంత్లీ మీటింగ్‌లో ఫ్రాన్స్ లేదా వెస్ట్ జర్మనీ నుంచి దిగుమతి చేయాలని నిర్ణయించి టెండర్లకోసం లెటర్స్ రాసారు."

"వ్యక్తిగతంగా ఈ కొత్త ప్రొడక్ట్‌ని వినియోగదార్లు ఎలా రిసీవ్ చేసుకుంటారని మీరనుకుంటున్నారు?" అడిగాడు బెనర్జీ ఫ్రెండ్

త్రిపాఠి ప్రాజెక్ట్ రిపోర్ట్‌లోని ఆ విషయాలని అవి తన స్వంత అభిప్రాయాలుగా ఏకరువు పెట్టాడు. స్కూల్ పిల్లలకి, రైల్వే స్టేషన్లలో, హాస్పిటల్స్‌లో వీటికి గిరాకీ ఉంటుందని చెప్పాడు.

కావలసిన సమాచారం పూర్తిగా వచ్చిందని ఆయన అనుకున్నాక అడిగాడు.

"మీరు జీతం ఎంత డ్రా చేస్తున్నారు?"

"రెండువేల తొమ్మిదివందలు ప్లస్ ఇతర అలవెన్సులు కలిపి మూడున్నరవేలు."

"మా నుంచి ఎంత ఎక్స్‌పెక్టు చేస్తున్నారు?"

"ఏదయినా లాభం ఉంటేనే కదా ఉద్యోగం మారేది. మరో వెయ్యి అదనంగా కోరుకుంటున్నాను."

మా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ముందు మీ కోరికని ఉంచుతాను. అందుకు వాళ్ళు ఒప్పుకోక అయిదువందలు మాత్రమే అదనంగా ఇస్తామంటే చేరతారా!" అడిగాడు ఆయన, అది నిజంగా ఇంటర్వ్యూ అనుకోవాలి అనే భావన కలిగించడానికి.

"సారీ! ఒప్పుకోను. హెల్త్‌ఫుడ్ ప్రొడక్ట్సు సౌత్ ఇండియాలో అతిపెద్దది. అది భరించగలదనే నా నమ్మకం." చెప్పాడు త్రిపాఠి వెంటనే.

"త్వరలో మీకు ఉత్తరం రాస్తాం. పిలవగానే వచ్చినందుకు మరోసారి థాంక్స్!" చెప్పాడు ఆయన.

బెంగుళూరులోని హెల్త్ ఫుడ్ ప్రొడక్ట్స్ వాళ్ళు తనని పిలిచి ఇంటర్వ్యూ చేసారన్న నమ్మకంతో త్రిపాఠి తిరిగి హైదరాబాద్ బయలుదేరాడు. కొంతకాలం అయాక ఆయన వాళ్ళకి ఫోన్ చేస్తే తమ కంపెనీవాళ్ళు త్రిపాఠిని ఇంటర్వ్యూ చేయలేదన్న సంగతి, అసలు తాము పేపర్లో దరఖాస్తులు కోరుతూ ప్రకటనే ఇవ్వలేదన్న సంగతి తెలుస్తుంది. ఆయన ఆశ్చర్యపోతాడు. తనని ఎవరు ఇంటర్వ్యూకి అంత ఖర్చుచేసి పిలిచారో అర్థంకాదు. ఎందుకు పిలిచారో నిజం అర్థం చేసుకోలేకపోతే అదాయనకు ఓ శేషప్రశ్నలా ఉండిపోతుంది.

త్రిపాఠి వెళ్ళాక వచ్చిన బెనర్జీ విశ్వం ఆ టేప్ మొత్తం విన్నారు. పూర్తిగా విన్నాక చెప్పాడు విశ్వం.

"అదన్నమాట"

"ఫుడ్ పల్ప్ డ్రింక్స్ మనకి కొత్త. ఖచ్చితంగా అవి సాఫ్టు డ్రింక్‌కి పోటీ అవుతాయి" ఆలోచనగా చెప్పాడు బెనర్జీ.

ఆ విషయం మీద ఇద్దరూ కాసేపు చర్చించుకున్నాక చెప్పాడు బెనర్జీ.

"మన పబ్లిసిటీ కేంపైన్‌లో మార్పు రావాలి. పల్ప్ డ్రింక్స్ ఆరోగ్యం కోరుకునే ముసలివాళ్ళకని, సాఫ్టు డ్రింక్స్ ఎనర్జటిక్‌గా అడ్వెంచరస్‌గా ఉండే యువతకని ఇంప్రెషన్ కలిగేలా పబ్లిసిటీని ఇప్పటినుంచే ప్లేన్ చేస్తే అది కేవలం 'హెల్త్ డ్రింక్' అనే చాలా మంది వినియోగదార్లు నమ్మచ్చు. ప్రకటన ద్వారా మనం ఉత్పత్తి గురించి చెప్పేకంటే, దానివల్ల కలిగే లాభం గురించి చెప్పడం మంచి మార్గం. ఎరువులు కొనే వాళ్ళకి నిజానికి కావలసింది అదికాదు. పచ్చటి పొలాలు? ఈ కేంపైన్ అలాంటిది"

ఇద్దరూ పల్ప్ డ్రింక్స్ పోటీని ఎలా ఎదుర్కోవచ్చో మరికొన్ని పాయింట్స్ చర్చించుకున్నారు. వ్యాపార విషయాల్లో హానస్టీ కాక వక్రబుద్ధిగా ఆలోచించడం ద్వారా విజయం సాధించడం షార్ట్‌కట్ పద్ధతిగా అవలంబించే బెనర్జీ బుర్ర ఇలాంటి విషయాల్లో చురుగ్గా పని చేస్తుంది.

అదే రోజు రాత్రి బయలుదేరితే విమానం చూసే అవకాశం ఉంది కాబట్టి మర్నాడు ఉదయం ఫ్లయిట్‌కి హైదరాబాద్ చేరుకోవాలనుకున్నారు.

ఆరు దాటాక మళ్ళీ మందు తాగడం మొదలు పెట్టాడు బెనర్జీ. "ఎన్నడూ లేనిది ఏమిటింత ఎక్కువగా తాగుతున్నావు" ఆశ్చర్యంగా అడిగాడు విశ్వం అర్ధరాత్రి ఒకటి దాటాక.

"నీకు నిద్రవస్తే పడుకో"

"రేపు ఉదయమే ఫ్లయిట్" గుర్తుచేసాడు విశ్వం.

"అయితే?" ఎర్రబడ్డ కళ్ళతో చూస్తూ అడిగాడు బెనర్జీ.

"లేవాలిగా"

"నేనసలు ఈ రాత్రి నిద్రపోతేగా రేపు లేవడానికి" చెప్పాడు బెనర్జీ గ్లాసులోకి విస్కీ వంచుకుంటూ.

●●●

మర్నాడు ఉదయం విమానం హైదరాబాద్ లో దిగాక ఎయిర్ పోర్ట్‌నుంచి సరాసరి ఇంటికెళ్ళి పోయాడు బెనర్జీ.

ఇంట్లోకి వచ్చిన అతన్ని, ముఖ్యంగా అతని మొహాన్ని చూసి అడిగింది అనసూయ భర్తని.

"అదేమిటలా ఉన్నారూ?"

ఆ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా చెప్పాడు బెనర్జీ.

"పడుకుంటున్నాను. నేను నిద్రలేచేదాకా లేపద్దు, ఎవరు ఫోన్ చేసినా సరే.."

"రాత్రి సరిగ్గా నిద్రలేదా?" అడిగింది అనసూయ.

"సరిగ్గా కాదు, అసలే లేదు" చెప్పాడు బెడ్ రూంలోకి వెళుతూ.

బట్టలు కూడా మార్చుకోకుండా అలాగే పక్కమీదకి వాలిపోయాడు. అతని కాళ్ళకున్న సాక్స్‌ని అనసూయే తీసింది. బెనర్జీ తల్లి అనసూయ గదిలోంచి బయటకి రాగానే అడిగింది.

"ఈ రెండు రోజులుగా డ్రింక్ ఎక్కువైనట్లుంది కదమ్మా?"

"అవునండి"

ఆవిడ చిన్నగా నిట్టూర్చింది.

"వాటిని కంట్రోల్ చేసేవాళ్ళేలేరు. ఉన్న ఒక్కాయన పైకివెళ్ళిపోయారు. నా మాట ఖాతరు చేయడు. అసలు మీనాన్నగారు పిల్లలు పుడుతారా లేదా అన్న పరీక్ష చేయించకుండా ఉండాల్సింది. దానివల్లే అనుకుంటా ఈ మార్పు."

"మొదటినుంచీ డ్రింక్ ఆయన బలహీనత" అనసూయ బాధగా చెప్పింది.

"మీరిద్దరూ ఓ వారం పదిరోజులపాటు ఎటయినా వెళ్ళొస్తే మంచిదేమో అనిపిస్తోంది" ఆవిడ చెప్పింది.

"అడిగి చూస్తాను" చెప్పింది అనసూయ.

●●●

ఆ రోజు ఉదయం మైత్రి బెనర్జీ గదికి రెండుసార్లు వెళ్ళింది. అతను ఆఫీసుకు రాలేదని చెప్పాడు ప్యూన్. ఇంటికి ఫోన్ చేసింది. బెనర్జీ నిద్రపోతున్నాడని జవాబు వచ్చింది.

అతన్ని చూసి అప్పటికే మూడోరోజు. తననుంచి మొహం చాటువేయడానికి అతనలా ఆఫీసుకి రావడంలేదా అన్న అనుమానం క్షణకాలం మైత్రికి కలిగింది. అలా అయిఉండదనుకుంది.

ఆఫీసులో తన కొలీగ్స్‌తో యూనియన్ గురించి లంచ్ అవర్‌లో మాట్లాడింది. అంతా మొగ కొలీగ్సే. వాళ్ళలో గతంలో యూనియన్ పెట్టాలని ప్రయత్నించి, మేనేజ్ మెంట్‌కి భయపడి ఆగిపోయిన త్రిభువన్ కూడా ఉన్నాడు. అతను చిన్నగా నవ్వి చెప్పాడు.

"నాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురూ ఆడపిల్లలే. కొడుకు పుడతాడేమోనని మూడోసారి కూడా చూసాను. ఈ ఉద్యోగం పోతే వాళ్ళని నా భార్యని పోషించడం ఎలా? సమాధానం లేకే ఆగిపోయాను. కానీ ఆడవాళ్ళయి ఉండి మీరు ఇందుకు కృషిచేస్తూంటే మళ్ళీ నాకు కొత్త ధైర్యం వస్తోంది. మీరు సరేనంటే నేను సరేనే. గప్‌చిప్ గా యూనియన్ రిజిష్టర్ చేసేసాక ఎవరూ ఏం చేయలేరు."

"మీ నిర్ణయానికి అభినందిస్తున్నాను" చెప్పింది మైత్రి ఆనందంగా.

"అంతగా అయితే లేబర్ కోర్టు ఎలాగూ ఉంది" నవ్వాడు చెప్పి.

యూనియన్ రిజిస్టర్ చేయడానికి కావలసిన కాగితాలు, డాక్యుమెంట్స్ సిద్ధం చేసేపని త్రిభువనే తీసుకున్నాడు.

అతనికి, మైత్రికి బాగా మద్దతునిచ్చేవాళ్ళు డజను మందికి పైగానే ఉన్నారు. వాళ్ళకి సహాయం చేసి సంతకాలు చేయడానికి మరో పదిమంది ముందుకు వచ్చారు.

బెనర్జీ ఇంట్లో నిద్రపోతుంటే, మైత్రి త్రిభువన్, మరో ఇద్దరు యూనియన్‌ని స్థాపించే పనిని చేబట్టారు. సాయంత్రానికల్లా యూనియన్‌లో చేరడానికి సిద్ధపడ్డ సభ్యుల సంతకాలు తీసుకున్నాడు. వర్కర్స్‌లో ముప్పై శాతం మంది సంతకాలు చేసారు.

విశ్వానికి ఈ సంగతులన్నీ ఎప్పటికప్పుడు చేరవేసే గూఢచారులున్నారు. అతను మండి పడ్డాడు. మైత్రిని, త్రిభువన్‌ని పిలిచి తిట్టాడు, హెచ్చరించాడు, బెదరించాడు. వాళ్ళు లొంగలేదు. బెనర్జీ కోసం ఇంటికి రెండుసార్లు ఫోన్ చేసాడు. అనసూయ ఆయన లేపద్దన్నారని, లేపనని చెప్పింది.

యూనియన్‌లో చేరిన వాళ్ళందరికి నోటీసులు ఇస్తారని, ఉద్యోగంలోంచి తీసేస్తారని ప్రచారం చేయించాడు. కొన్ని పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయని, వాటికి కేండిడేట్‌ని పంపమని, ఎంప్లాయ్ మెంట్ ఎక్స్చేంజ్‌కి రాసిన ఉత్తరం కార్బన్ కాపీని బోర్డులో ఉంచాడు.

ఫేక్టరీలో యూనియన్ స్థాపిస్తారన్న వార్త కార్చిచ్చులా వ్యాపించింది.

మైత్రి, త్రిభువన్ ఇతరులు మర్నాడు ఉదయం రిజిస్ట్రార్ ఆఫీసులో పదిన్నరకి కలుసుకోడానికి నిర్ణయించుకున్నారు. జనరల్ షిఫ్ట్ అయాక మైత్రి బయటికి నడిచింది. ఎన్నడూ లేనిది గేట్ దగ్గర వాచ్ మెన్ కూడా ఆమెకి శాల్యూట్ చేసాడు.

సెక్యూరిటీ ఆఫీసర్ సింహాచలం, విశ్వం చేసిన ఏ ప్రయత్నం ఫలించలేదు. యూనియన్‌లో చేరిన వాళ్ళకి మెత్తగా దేహశుద్ధి తప్పదని సింహాచలం ఓపెన్‌గా అంతా వింటూండగా చెప్పాడు. గతంలోలా త్రిభువన్ దాన్ని కాతరు చేయలేదు. అతన్నోసారి సింహాచలం ఫేక్టరీ వెనకాల,ఇద్దరు వాచ్‌మెన్‌లు కదలకుండా పట్టుకుంటే కొట్టడం జరిగింది.

"దిలాంగెస్ట్‌డేనాడు హిట్లర్‌ని నిద్ర లేపడానికి భయపడితే జరిగిన వినాశనంలాంటిది ఇప్పుడు బెనర్జీ నిద్రపోతూంటే జరుగుతోంది" చెప్పాడు విశ్వం చిన్నగా నిట్టూర్చి.

"మన చేయగలిగింది చేసాం" చెప్పాడు సింహాచలం.

"ఓ ఆడది ఇంత సాహసం చేయడంతో నాకు తల తీసేసినట్లు ఉంది. ముఖ్యంగా బెనర్జీతో సానిలా పడుకున్న ఆడది" కసిగా చెప్పాడు విశ్వం.

"బెనర్జీకి చెప్పండి. నన్నడిగితే అలాంటివాళ్ళని ఫేక్టరీ ఆవరణలోకే రానీకూడదు. దాన్ని అలుసుగా తీసుకుంటారు. డబ్బిచ్చి ఆ పని బయట చేసి బయటనుంచే పంపేయాలి. ఇక్కడి వాళ్ళతో సంబంధాలు పెట్టుకుంటే ఇలాగే ఉంటుంది"

"ఆ మైత్రి ఉద్యోగంలో చేరినప్పటినుంచి నాకు అనుమానంగానే ఉంది. బెనర్జీతో ఏం మాట్లాడుతుందో తెలీదుకాని రహస్యంగా ఈ మధ్య తరచూ మాట్లాడుతోంది. నన్నడిగితే అతన్ని ఏదో విషయంలో బ్లాక్ మెయిల్ చేస్తోంది అనిపిస్తోంది. ఇంతలా బెనర్జీ తాగేవాడు కాదు."

"అదేవిటో అడగకూడదు?" అడిగాడు సింహాచలం.

"అడిగితే మనతో చెపితేనా?" చెప్పాడు విశ్వం.

మర్నాడు ఉదయం బెనర్జీ బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ దగ్గర తన తల్లికూడా ఉండటం చూసి కొద్దిగా ఆశ్చర్యపోయాడు.

"అనసూయేది?" అడిగాడు బెనర్జీ.

"షాపింగ్‌కి వెళ్ళింది"

ఇద్దరిమధ్యా కాసేపు మౌనం.

"నువ్వు ఖర్చులు కొద్దిగా తగ్గిస్తే మంచిది" చెప్పింది.

ఆవిడ ఏ ఖర్చుగురించి మాట్లాడుతోందో అర్థం చేసుకున్న బెనర్జీ జవాబు చెప్పలేదు.

"ఆరోగ్యాన్ని, కాలాన్ని పాడుచేసే అలవాట్లు చేసుకోకు. అది మన ఇంటా, వంటా ఎన్నడూ లేదు"

బెనర్జీ వంచిన తలెత్తలేదు. తనంటే భయం ఇంకా ఉందని గ్రహించిందావిడ. లేక అది గౌరవమా అనుకుందావిడ మనసులో.

"నిన్న నీ ప్రవర్తనేం బాగాలేదు. లక్షలతో వ్యాపారం చేసే వాళ్ళకిలాంటిది మంచిదికాదు మీ నాన్నగారు వ్యాపార విషయంలో ఎపుడు ఆంత అప్రమత్తంగా ఉండేవారో తెలుసా?"

బెనర్జీ కిక్కురుమనలేదు. ఆ తర్వాత ఆవిడకూడా ఆ టానిక్ గురించి మాట్లాడలేదు. ఆఫీసుకి బయలుదేరబోయే ముందు చెప్పింది.

"ఆఫీసులో దిగాక కారు అనసూయకి పంపించు. డ్రయివర్‌కి తెలుసు ఎక్కడ ఎక్కించుకోవాలో"

బెనర్జీ కోసం విజిటర్స్ గదిలో ఆతృతగా ఎదురుచూస్తున్న విశ్వం చెప్పాడు.

"నీ కోసం నిన్న రెండుసార్లు ఫోన్ చేసాను. అంత మొద్దునిద్రపోయావే?"

"మైత్రిని అర్జంట్‌గా రమ్మను" చెప్పాడు బెనర్జీ.

అతను కారులో వస్తూ దారిలో సుధీర్ గురించి, మైత్రి గురించి ఆలోచిస్తున్నాడు. ఆ విషయంలో ఓ ఏర్పాటుకి వస్తేకానీ అతనికి సుఖం శాంతి లేవు.

"మైత్రి గురించే నిన్న నీకు ఫోన్ చేసింది"

"మైత్రి గురించా? ఎందుకు?" అడిగాడు బెనర్జీ.

"మన ఫేక్టరీలో వర్కర్స్ యూనియన్ స్థాపిస్తోందా రాణిరుద్రమదేవి"

"యూనియనా?"

"అవును అది, త్రిభువన్ మరికొందరు. ఇవాళే రిజిష్టర్ చేస్తున్నారు. ఇంకా వాళ్ళెవరూ ఆఫీసుకు రాలేదు."

"నిజంగా?" అడిగాడు బెనర్జీ ఆదుర్దాగా.

"అవును"

"మరి నువ్విక్కడుండి ఏం చేస్తున్నావు? అసలంత దూరం ఎందుకు రానిచ్చావు?" విశ్వం మీద ఎగిరిపడ్డాడు బెనర్జీ.

"నా శాయశక్తులా ప్రయత్నించాను"

"యూనియన్ ఏర్పాటయితే అందులోని పదిమందిదాకా వెంటనే తీసేయాలి. టెర్రర్ సృష్టించాలి వాళ్ళలో. అవసరం అయితే లే అవుట్‌కి కూడా వెనుకాడమని వాళ్ళకి తెలియాలి" చిందులు తొక్కాడు బెనర్జీ.

"త్రిభువన్, మైత్రి" ఎవరెవర్ని తీసేయాలో విశ్వం జాబితా చెప్పాడు. వాళ్ళమీద ఏ ఛార్జీలు ఫ్రేమ్ చేసి తీసేయాలో ఇద్దరూ అరగంట సేపు ఆలోచించారు. స్టెనోగ్రాఫర్‌ని పిలిచి వాళ్ళ సస్పెన్షన్ ఆర్డర్స్‌ని స్వయంగా డిక్టేట్ చేసాడు బెనర్జీ.

"అసలు నువ్వా మైత్రిని నెత్తికెక్కించుకుంటున్నావని నా అనుమానం. అలాంటి వాళ్ళని బెడ్ రూందాకానే ఉంచాలి. ఫేక్టరీలోకే రానివ్వకూడదు" మందలింపుగా చెప్పాడు విశ్వం.

అంతా రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి తిరిగి వచ్చేవాళ్ళకోసం ఆత్రంగా ఎదురుచూడసాగారు. వర్కర్స్ ఆఫీస్ స్టాఫ్, బెనర్జీ, విశ్వం సమానంగా.

*** *(ఇంకా ఉంది)*